# బెడ్డింగ్ మాస్టర్ !

రామారావుకు అందమైన 'నిక్‌నేమ్' వుంది! అతడిని డిపార్ట్‌మెంట్లో అందరూ ముద్దుగ 'బడ్డింగ్ మాస్టర్' అనే పిలుస్తారు. క్రమేపీ అతని అసలు పేరు మరుగున పడిపోయింది.

ఇంటా బైట అందరూ అదేపేరుతో పిలుస్తూంటారు. బెడ్డింగ్ మాస్టర్ అనబడే రామారావు డిపార్ట్‌మెంట్‌లో టాప్-టు-బాటమ్ తెలుసు. ఇతని ప్రతిభాపాటవాలు... వినయవిధేయతలకు మురిసిపోతూంటారంతా!.

మనిషి మహామేధావి!. ఎలాంటి వారినైనా క్షణాల్లో బుట్టలో వేసుకోగల తెలివి అతని సొంతం!. మహా కాకారాయుడు! అలాంటి ఇలాంటి 'కాకా' కాదు... మహావీర... మాడ్రేక్ కాకా!

ఆఫీసులో అతనికి ప్రత్యేకించి సీటంటూ లేదు. వర్కు చేయాల్సిన అవసరంలేదు. రిలాక్‌డ్‌గా కూర్చోవటానికి అతనికంటూ ఓ దివాల్వింగ్ ఛైరుంది!. ప్రత్యేకంగా కేబిన్ వుంది!. ఓ టెలిఫోనుంది! ఎండాకాలంలో ఉక్కపోయకుండా వుండేటందుకు ఓ సీలింగ్‌ఫ్యాను... చల్లగా వుండేటందుకు కూలర్ వుంది.

ఇన్నివున్న రామారావుని కొత్తవారెవరైనా చూస్తే చిన్నపాటి ఆఫీసరేమోని భ్రమిస్తారు. అతనికి ఫైళ్లతో పన్లేదు. జీ.వో.లు చదివి బట్టీయం వేయాల్సిన అవసరం అంతకంటే లేదు.

రామారావ్ టెన్త్ నాలుగుసార్లు 'డింకీలు' కొట్టినా... కంపార్ట్‌మెంటల్‌గ పాసైనా... అవి పాతరోజులు కాబట్టి పిల్చి మరీ ఇంటర్లో సీటిచ్చారు. ఇంటర్మీడియేట్ పూర్తి కావటానికి నాలుగేళ్లు అటుపై డిగ్రీ ఫినిష్ చేయటానికి ఆరేళ్లు పట్టింది. కాపీలు కొట్టి పాసైన బాపతు!. చదువుమీద బొత్తిగా లేదు శ్రద్ధ!. కొడుక్కి అసలు చదువే అబ్బక థర్డ్‌ఫారమ్‌తో ఆపేసి ఇకపై చదివేదిలేదని మొండికేస్తాడేమోని తండ్రి అప్పారావ్ దిగులుపడ్డాడు. మొత్తానికి శుంఠ డిగ్రీ పుచ్చుకోవటమంటే దేశ రాష్ట్రపతి పదవి చేపట్టినంత సంబరపడ్డాడు అప్పారావు.

ఇహ కొడుకు ఫ్యూచర్‌కేం భయంలేదు. ఏగన్నాయెూ వుద్యోగం... ఏ

తలకుమాసినవాడు పిల్లనో ఇవ్వకపోరు కన్నకొడుక్కి!

అప్పారావ్... ఆరోజుల్లో కేవలం సెకండరీ గ్రేడ్ స్కూల్‌టీచరు. జీతం బహుస్వల్పం!. బోటాబోటీగ ఇంటి ఖర్చుకు సరిపోయేది. అధిక సంతానం కలిగివుంటే అప్పులపాలు అయ్యేవాడేమో... ఆ దేవుడు దయతలిచి ఒకేఒక్క పుత్రరత్నాన్ని ప్రసాదించినందువల్ల సంసారం అనే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నష్టాల బారిన పడకుండా సజావుగా సాగిపోతోంది.

అప్పారావు మేష్టారికి మంచి పేరుంది! ఒక్క నిముషం వేస్ట్ చేయకుండా పీరియడ్ అంతా శ్రద్ధగా పిల్లలకు క్లాసులో పాఠాలు చెప్తాడు. క్లాసులో ఫాలోకాలేని కుర్రాళ్లని ఇంటికి రమ్మని ట్యూషన్‌ఊ చెప్తాడు. ఆరోజుల్లో ట్యూషన్లు చెప్పకూడదనే రూల్లేదు. ఒక్క ప్రభుత్వ వైద్యులకు మాత్రమే ఇటీవలి కాలంలో ప్రైవేట్ ప్రాక్టీసులు పెట్టుకోరాదనే రూలు వచ్చింది.

పిల్లలను కొట్టే అలవాటు అప్పారావ్ మేష్టారికి లేదు. ఎప్పుడైనా కోమొస్తే గోడకుర్చీ వేయించేవాడు కాస్సేపు. పాఠాలు అర్థమయ్యేట్టు నూరిపోయటం ఆయన అలవాటు!. బెత్తం ఆయన చేతిలో కేవలం అలంకారప్రాయడే! దాన్ని దండనకు ఏనాడూ ఉ పయోగించి ఎరుగడు!

'పిల్లలను కొట్టకూడదండీ... కొడితే మనపట్ల వారికి గల భయం... గౌరవాభిమానాలు దూరమౌతయ్...' తోటి టీచర్స్‌తో హితవు పలుకుతూంటాడు అప్పారావ్.

వెనకటి రోజుల్లో పంతుళ్లంటే స్టూడెంట్స్‌కు అపరిమితమైన గౌరవం. భయం భక్తులుండేవి! ఈరోజుల్లో పిల్లలను చూచి టీచర్లే భయపడాల్సివస్తంది. నేటి తరంలో భయం... గౌరం... వినయం... మృగ్యం!.... ఈ మాటలు అర్థాలను కోల్పోయినయ్.

యాభైయ్యేళ్ల క్రితం బి.ఏ. పాసైన వాళ్లంటే... ఈరోజుల్లో ఎం.ఏ.పిహెడి. ల కంటే ఎక్కువ. ఉద్యోగినికి అప్లై చేసిందే తడవు అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికొచ్చేది. ఇప్పటిఇలా పరీక్షలు... ఇంటర్వ్యూలు రిజర్వేషన్లు ఎక్కడేడ్చినయ్?

అప్పారావ్ మంచితనం ఎరిగిన ఓ ప్రభత్వాధికారి ఆయన నోరు తెరిచి అడగ్గానే రామారావుకు వుద్యోగం ఇచ్చేశాడు. అప్పట్లో వ్యక్తి విలువ జాస్తి! ఇప్పుడు నాస్తి!

వ్యవహారాలన్నీ 'కుల' ప్రాతిపదిక మీదే నడుస్తున్న రోజలాయె ఇవి!. ఏదైనా

పని చేసిపెట్టమని ఒక్కసారి అడిగితే చాలు. ఆ రోజుల్లో ఎవరైనా ఠక్కున చేసేవారు. ఇప్పుడో ఏపని కావటానికైనా ఏళ్లు కూళ్లు!. అసలు మొర ఆలకించేవారేరి?. జీవనశైలి అంతా రాజకీయమైంది!.

రామారావు అఖండుడు! చూచిరమ్మంటే కాల్చివచ్చే మనిషి! ఏవరికేది కావాలో చిటికెలో తెలుసుకోగల మేధావి!. అధికారగణానికి పర్సనల్ పర్లు చేసిపెడుతూ బతికేస్తున్నాడు. ఆఫీసర్లకు ఆరో(ప్రాణం రామారావు అనబడే బెడ్డింగ్ మాస్టర్.

అతడిని అలా పిలుస్తుంటే బిడియపడడు! నామోషి ఫీలవడు. ఏవరేమనుకున్నా తడిచేసుకుపోయే తత్వం!. బ్రతకనేర్చినవాడు! అతనంటే డిపార్ట్‌మెంట్లో అందరికి తల్లోనాలుక! ఎవరికేపని కావాలన్నా... బెడ్డింగ్ మాస్టర్‌కే పురమాయిస్తారు. నవ్వుతూ... భజాలెగరేసుకుంటూ క్షణాల్లో చెప్పిన పన్లు ఎలాంటివైనా సరే చేస్తాడు.

వట్టిమాటల పోచికోనేకాదు. క్రియాశీలుడు కూడా!. అదే అతనిలోగల గ్రేట్‌నెస్!.

పైవాళ్లకి పక్కలేస్తూ సొంతపన్లు చేసిపెట్టటంలో ఆరితేరినవాడు కాబట్టే... రామారావు మహాశయుడుకి బెడ్డింగ్ మాస్టర్ అనే బిరుదు ప్రదానం చేవారంతా ఏకమై!

ఈ విద్య అందరికీ అబ్బదుసార్!. ఇలాంటి పన్లు చేయటంలో కొందరే నిష్ణాతులు!. అది నా పూర్వజన్మ శుకృతం! దేనికైనా లక్కుండాలి! అది నాకున్నది. ఇదిగో... ఇలా వెలిగిపోతున్నాను... అనేసి అడిగినవారికి అడగని వారికి గర్వంగ చెప్తూంటాడు.

సిగ్గు ఎగ్గులేని నాలాంటి వాళ్లే ఇలాంటి పన్లు చాకచక్యంతో గబగబా చేసేస్తుంటారు... అంటూంటాడు అందరితో.

'ఒరే... నువ్వెప్పుడూ బలాదూర్ తిరుగుతూంటావ్... ఆఫీసుపని ఎప్పుడు చేసావురా?-' అప్పారావ్ కొడుకుని ఒకరోజు నిలదీసాడు.

'నేనా?.. ఆఫీసువర్కా?... చెయ్యటమా?... నాకంటూ ఓ సీటు లేదు... వర్క్ ఎలాట్‌మెంట్ అంతకంటే లేదు. నాది పి.ఆర్.ఓ. జాబ్ డాడీ...' నవ్వేస్తూ చెప్పాడు.

'అంటే పైపై పన్లు చేయించుకుంటూ... నీకు నెలనెలా శాలరీ ఇస్తున్నారటమాట!...' ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

'కాదులే! పేరుకే ఎల్డీసీ!...' కాని నా పరపతి... హెూదావేరు! నాకు రాసే పని ఫైళ్ళు చూసేపని లేదు.'

'అర్థం కాలేదురా'...ప్రశ్నార్థకంగ రామారావు ముఖంలోకి చూశాడు.

'వెరీసింపుల్ డాడీ! అందరూ నాచేత పర్సనల్ వర్క్సు చేయించుకుంటారన్నమాట.! నా పనితనానికి అంతా మెచ్చుకుంటూంటారు. అండ్రస్టాండ్...' గర్వంగ చెప్పాడు.

'వాళ్ల పర్సనల్ పన్లు చేసిపెట్టటానికా గవర్నమెంట్ నీకు జీతం ఇస్తున్నది?. అలాంటి ముదరష్టపు పన్లు చెయ్యటానికి నీకు సిగ్గన్పించటం లేదట్రా?.-'

'పో డాడీ!... నీవన్నీ పాత చింతకాయపచ్చడి మాటలు... ఒకసారేమైందనుకున్నావ్?...'

'అదీ నువ్వే చెప్పు?-'

'మా బిగ్‌బాస్... ఐ.ఎ.ఎస్. ఆఫీసరు... ఇన్స్పెక్షనంటూ మా ఆఫీసుకొచ్చాడు. ఆయనకు ఏంకావాలో... అన్నీ నన్నే చూచుకోమన్నాడు మాబాస్. గెస్టుహౌస్‌లో బిగ్‌బాస్ మకాం ఏర్పాటు చేశాం!. ఆయన వుండే గదంతా రూమ్‌ఫ్రెష్‌నర్ 'స్ప్రే' చేయించాను. బాత్‌రూమ్‌లో శాండల్‌సోపు షాంపు... టర్కీటవలు వుంచాను. ఫ్రిడ్జ్... టీ.వీ.. కూడా వుండటంతో అవి కండిషన్లో వున్నాయో లేదో చెక్ చేసి ఫ్రిడ్జ్‌లో ఓ అరడజను బిస్లరీ వాటర్ బాటిల్స్ పెటి&ంచాను. మా బాస్... నన్ను... బిగ్‌బాస్‌కు పరిచయం చేసి నన్ను ఆయనకు ఎటాచ్ చేశాడు'.

'ఓరి నీ దుంపతెగిపోను. ఇదా నీ పని?-' ఆశ్చర్యం ప్రకటించాడు అప్పారావ్ నొసలు చిట్లించి.

'కథ క్లైమాక్స్ చేరుకోకముందే నువ్వు ఆశ్చర్యపోతే ఎట్లాడాడీ!... ఇంకా చెప్పాలి... వివరంగ చెప్తాను... విను. ఆయనగారికి లిక్కర్ పుచ్చుకునే అలవాటుంది కాబోలు... అవిషయం నాతోటి ఎలా చెప్పాలాని సంశయిస్తూండగ... ఆయన ఆంతర్యం పసికట్టి... సార్ ఇది జిల్లా కేంద్రమన్నమాటేగానీ... ఇక్కడ దొరకనిదిలేదు... ఫారిన్ లిక్కర్‌తో సహా సర్వం దొరుకుతయ్... అనగానే... ఆయన ముఖం విప్పారించది. నాచేతికి రెండువేలిచ్చి 'ఓఫుల్ పట్రా...' నాలుగురోజులుంటాను అన్నాడు. ఆఘమేఘాలమీద వెళ్లి ఫుల్ బాటిలొకటి తీసుకుని వస్తూ చికిన్ బిర్యానీతో పాటు మీల్స్ క్యారియర్ తెచ్చి ఆయన ముందుంచాను. నా చొరవకు నన్నభినందించాడు. ఫ్రిడ్జ్‌లోంచి మినరల్ వాటర్ బాటిల్స్... కడిగి శుభ్రంగ వుంచిన గాజుగ్లాసు ఆయన ముందుంచి... నేను బైట పోర్టికోలో వుంటాను కాస్సేపు అవగానే... యస్ యస్స్... ఎవర్నీలోనికి రానీకు. డిన్నర్

ఫినిష్ అయ్యాకే వెళ్దువులే... అనటంతో నైను బైటికొచ్చాను...' చెప్తూ ఆగేడు.

'ఒరి భడవా... నువ్వు చేస్తున్న వెధవపన్లు... దిక్కుమాలిన పన్లు ఇవా?. చక్కగా వుద్యోగం చేసుకోకుండా... ఇంటావంటలేని దరిద్రపు గొట్టు పన్లు చేయటానికి నీకు సిగ్గనిపించటంలేదట్రా...' కటువుగా మాట్లాడాడు అప్పారావ్.

'అలా అనకు డాడీ! ఈవిధంగ ఆఫీసర్లందరికీ దగ్గరవుతూ వస్తున్నాను. ఇందలో తప్పేముంది? రెండరింగ్ ఆఫ్ సర్వీస్!... దట్సాల్. ఆఫీసర్స్ దగ్గర నాకు పలుకుబడి పెరిగింది తెల్సా?.- ఎవ్వరూ చేయని పని నేను చేస్తున్నాను కనుకనే... నేంటే పైవాళ్లందరికీ ఎంతో అభిమానం!... ఇష్టం!!'

'దరిద్రపుగొట్టు పన్లు చేస్తూ సంపాదించేది కూడా గౌరవమేనా?... చెప్పుకోవటానికి సిగ్గుగా లేదట్రా?-' పళ్లు నూరేడు అప్పారావ్.

'సిగ్గెందుకు డాడీ? వాళ్ల అవసరాలూ తీరుతున్నయ్... నాకు పరపతీ పెరుగతోంది. ఒకసారి ఏంజరిగిందంటే.. చెప్తే బిత్తరపోతావ్. ఒకసారి మా జె.డి. గారు ఏదో సాతపని మీద వచ్చి మా గెస్ట్ హౌస్‌లో దిగారు. ఆఫీసరెవరొచ్చినా వాళ్లకు నేనేగా దిక్కు! నేను తప్పవారిని చూచుకునేవారుగాని... పన్లుచేసి పెట్టేవారెవరున్నారని? నన్ను ఆయనకు 'ఎటాచ్' చేశాడు మా బాస్...'

'జె.డి. గారికేం ఘనకార్యం చేసిపెట్టావురా సన్నాసీ?...'

డాడీ! నీతో ఇలాంటివి చెప్పరాదు. అయినా నీ తృప్తికోసం... అడిగావు కనుక చెప్తావిను! ఆ జె.డి. గారికి తాగే అలవాటైతే లేదుగానీ అమ్మాయిల పిచ్చి అయితే వున్నట్టు ఆయన మాటల ద్వాఅర పసికట్టాను...'

'ఒరి దౌర్భాగ్యుడా?... చివరికి ఇలాంటి అప్రాచ్చపు పన్లకు ఒడిగట్టావా?-' నివ్వెరపోయాడు అప్పారావ్. కొడుకు నోటివెంట ఇలాంటి మాటలు వింటుంటే జుగుప్సాకరంగ వుంది. వళ్లంతా తేళ్లు జెర్రులు పాకుతున్నట్టనిపించింది.

'డాడీ... ఇలాంటి పన్లు చేస్తాననే... నన్నంతా బెడ్డింగ్ మాస్టర్ అని ముద్దుగా పిలుస్తూంటారు. అలా పిల్చి నన్ను వేళాకోళం చేస్తున్నారీ తెల్సు! అయినా సరే... నేనెవ్వరికీ భయపడను. ఇలా పన్లు చేయటం నా హాబీ!. ఉద్యోగమనే వైకుంఠపాళీ ఆటలో నేను నిచ్చెనలే ఎక్కుతాను... పాముల బారిన పడాల్సిన అవసరం వుండదు...'

'ఏడ్చావులేరా... ' అసహ్యంగ ముఖంపెట్టాడు.

'అసలు విషయం చెప్పఏలేదు. మా ఆఫీసులో అటెండర్ వుద్యోగం చేసే జానయ్య అనే వ్యక్తి అనుకోకుండా యాక్సిడెంట్‌లో చనిపోతే.. స్వీపర్ జాబ్‌కోసం భార్య అప్లికేషన్ పెట్టుకున్ని నాలుగేళ్లయినా పని జరగకపోవటంతో నాతో చెప్పుకుని ఏడ్చి సాయంకోరింది. ఆమెకు ఎలాగైనా సాయం చేయాలన్పించింది. అందుకే జె.డి.గారి దాహం ఈ విధంగ తీర్చాలనీ... ఆమకు వుద్యోగం ఇప్పించాలనే సదాలోచనతో వెళ్లి ఆటోలో వున్న వనజను తీసుకొస్తూ... సీపరు వుద్యోగం కోసం పెట్టుకున్న దరఖాస్తు కూడా వెంట తీసుకురమ్మన్నాను. ఆయన కోరిక తీర్చి... తన అవసరాన్నీ తెలివిగా తీర్చుకోమని గదిలోకి పంపాను. దట్సాల్! టు బర్డ్స్ ఎట్ వన్ షాట్ అనే సామెతలా... జె.డి. గారి దురదాతీరింది. వనసను స్వీపర్‌గ అపాయింట్ యెయ్యమని ఆమె దగ్గరున్న దరఖాస్తు మీద ఆర్డర్స్ పాస్ చేయించుకోగలిగింది! - చూశావా డాడీ!... నేను ఓ అనాథ విధవారాలుకి ఈ విధంగ సాయపడగిలిగినందుకు చేయంచింది పాడుపనైనా... నేను సంతోషించగలిగాను. తన విషయం బట్టబయలు చేయద్దంటూ ప్రాధేయపడిన వనజకు అభయమిచ్చాను. ఇప్పుడు చెప్పు డాడీ!... నే చేసిన పని రైటా.. రాంగా?-' జరిగింది క్లుప్తంగా వివరించి వూపిరిపీల్చుకున్నాడు రామారావు.

'ఒరేయ్... ఒరేయ్... అంట్లవెధవా! నువ్వు పూర్తిగ చెడిపోయావ్.. అక్కడికేదో ఘనకార్యం చేసినట్టు గర్వపడతావేంరా?-' రుసరుసలాడేడు అప్పారావ్.

మళ్లీ ఆయనే ! నాకడుపున పుట్టిన నీకు ఇవేం దుర్మార్గపు ఆలోచన్లురా?... నా గౌరవాన్ని గంగపాలు చేస్తున్నావ్...' అంటూ బాధపడ్డాడు.

'ఒక్కటి మాత్రం నిజం డాడీ! మనమేపని చేసినా... మనకు... ఇతరులకు సహాయపడాలన్నదే నా ఆలోచన! కాబట్టి నువ్ డోన్ట్ వర్రీ ఎబౌట్ మీ... నీకింకో విషయం చెప్పనా... నాకంటే ముందున్న సీనియర్స్‌ని ఓవర్ లుక్ చేసి నాకు యు.డి.గా ప్రమోషన్ రాబోతోంది. చూస్తూండు... ఇలాగే త్వరలో ఆఫీసరైపోతాను. నో వండర్! వడ్డించేవాళ్లు మనవాళ్లైతే కడపంక్తిలో వున్నా అన్నీ అందుతయ్! కాకాపట్టినా... బెడ్డింగులు పరచినా... మనం చేసేపని ఇతరులకు మనకు ఉపయోగపడటం-' మనసులో మాట తండ్రికి చెప్పాడు. ఉభయతారకం.

---సమాప్తం---